క్లుప్తంగా

నివాళులర్పించిన సమన్వయకర్త



మధు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: పట్టణంలోని 38వ వార్డు ముద్దిరెడ్డిపల్లి వాసి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మధు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక వెళ్లి మధు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. కౌన్సిలర్ మల్లిఖార్జునగౌడ్, నాయకులు శివారెడ్డి, వేణురెడ్డి, పరమేశ్వర రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాధమ్మ పాల్గొన్నారు.

పీడీఓలు పనితీరు మార్చుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ: అధికారులు చిత్తశుద్ధితో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. విరుప సముద్రం, దొమ్మతమరి గ్రామాల్లో శనివారం జనస్పందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పీడీఓలపై ఫిర్యాదులు అందుతున్నాయని, పనితీరు మార్చుకోవాలన్నారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకి రామ్, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషారాణి పాల్గొన్నారు.

సజావుగా నవోదయ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మడకశిర: పట్టణంలో శనివారం నవోదయ పరీక్ష సజావుగా జరిగింది. మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో240 మందికి గాను 91 మంది, బాలికోన్నత పాఠశాలలో 240 మందికి గాను 97 మంది, సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో 206 మందికిగాను 105 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 393 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ నరసింహమూర్తి తెలిపారు.

హిందూపురం: హిందూపురంలోని కొట్నూరు, ముదిరెడ్డిపల్లి బాలుర, అజీజియా, ఎంజీఎం, చిన్మయ, నేతాజీ, గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాలల్లో ప్రవేశపరీక్షలు జరిగాయి. 672 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1342 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ గంగప్ప తెలియజేశారు.

కార్తికేయుడికి పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న కార్తికేయుడు

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి జాతర మహోత్సవాల సందర్భంగా కార్తికేయుడికి ముత్యాల పల్లకి ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీలో ఊరేగించారు. జాతర మిఠాయి వ్యాపారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారి పల్లకీకి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బదరీ నాథ్ నేతృత్వంలో వేద పండితులు హోమాలు నిర్వహించారు.

పథకాలను వినియోగించుకోండి

రొద్దం: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. మండలంలోని బొక్సంపల్లి, తురకలాపట్నం గ్రామ పంచాయతీల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందకపోతే అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఏపీఓ రషీద్, బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోరంట్ల: నార్సింపల్లి గ్రామానికి చెందిన నరసింహులు,(34) అనే వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు నరసింహులు తన భార్య వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల రెండు సార్లు ప్రమాదంలో గాయపడి అనారోగ్యానికి గురయ్యాడు. శనివారం భార్య వరలక్ష్మి, పిల్లలు ఆరుబయట ఉండగా ఇంటి పైకప్పునకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.కేసు దర్యాప్తులో ఉంది.

జగనన్నది జనరంజక పాలన

- పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్





మహిళలతో ముచ్చటిస్తున్న పెనుకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్, బీచిగానిపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: జగనన్న జనరంజక పాలన అందిస్తూ రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నారని, సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలిచారని, జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా శనివారం పరిగి మండల పర్యటనకు విచ్చేశారు. బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు మంత్రికి గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి విజయతిలకాన్ని దిద్దారు. అనంతరం మంత్రి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆత్మీయ పలకరింపు యాత్రను ప్రారంభించారు. గొల్లపల్లి అనంతరం బీచిగానిపల్లి, పాత్రగానిపల్లి, వంగలపల్లి, శీగిపల్లి, గణపతిపల్లి, పైడేటి, కొత్తపల్లి, పీ నరసాపురం, ముద్దిరెడ్డిపల్లి, ఎస్ బీరేపల్లి, ధనాపురం, శిరేకోళం గ్రామాల్లో పర్యటించారు.

కోట్లాది మంది ప్రజలు జగనన్న వైపే

మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లకు పైగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి జగనన్న పెద్దపీట వేశారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా రాణించేందుకు అండగా నిలిచారన్నారు. కుల, మతాలకతీతంగా కోట్లాది మంది ప్రజలు జగనన్న వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడుతో పాటూ టీడీపీ నాయకులు ప్రభుత్వంపై ఎంతగా బురదజల్లుతున్నప్పటికీ ఎలాంటి వివక్ష లేకుండా వారికి సైతం సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నదేనన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు విభేదాలకు తావు లేకుండా కలిసికట్టుగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తనను ఇంటి ఆడబిడ్డలా ఆదరించాలని మండల ప్రజలకు మంత్రి ఉషశ్రీచరణ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ కన్వీనర్ జయరాం, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సర్పంచ్‌లు సరస్వతి, లక్ష్మణ్ణ, గంగాదేవి, ప్రభాకర్, మంజునాథ్‌రెడ్డి, బాలకృష్ణ, దిలీప్, యువజన విభాగం కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు సింగారెడ్డి, చంటి, మారుతీరెడ్డి, రామచంద్ర, చిక్కేగౌడ, నరసయ్య, యోగానందరెడ్డి, రాము, మాజీ ఎంపీపీ గోవిందప్ప పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పెనుకొండ: రాష్ట్ర స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎసార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, కౌన్సిలర్ సుధాకరరెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 9–30 గంటలకు సత్తారుపల్లి, అనంతరం మావటూరు, సుద్దబట్లపల్లిలో ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారన్నారు. మావటూరులో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించి తదుపరి క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు.

పరిగి: పరిగి మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి ఉషశ్రీ చరణ్ ఆదివారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కాలువపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం ఉంటుందని, అనంతరం కొడిగెనహళ్లి, బిందూనగర్, పెద్దిరెడ్డిపల్లి, సుబ్బరాయనపల్లి, బాలిరెడ్డిపల్లి, శాసనకోట గ్రామాల్లో మంత్రి పర్యటిస్తారని తెలిపారు.

మంత్రిని కలిసిన సమన్వయకర్త ఈర లక్కప్ప



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం కొడికొండ చెక్ పోస్టు వద్ద మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మంత్రి కూడా ఈరలక్కప్పను అభినందించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని మంత్రి సూచించినట్లు ఈరలక్కప్ప తెలిపారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు పాల్గొన్నారు.

23న కాకి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

రొళ్ల: కాకి గ్రామ సచివాలయ ఆవరణలో ఈనెల 23వ తేదిన ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్‌వై లక్ష్మమ్మ తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేద్దాం

- మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. ఆయన శనివారం మడకశిర పట్టణంలో పర్యటించారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ హనుమంతరాయప్ప తదితర నాయకులను కలిశారు.మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డితో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కోరారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీని గెలిపించాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, జీబీ శివకుమార్, రంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న సమన్వయకర్త ఈర లక్కప్ప

అమరాపురం: హేమావతి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం పర్యటించారు. పార్టీ ముఖ్య నాయకులను కలిశారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. రాబోవు ఎన్నికల్లో కలసి కట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామన్నారు. కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గగన, సీనియర్ నాయకులు జయప్రకాష్, తన్వీర్‌గౌడ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హిందూపురం అర్బన్: కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపైన అవగాహన పెంచుకోవాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పట్టణంలోని ఆటోనగర్‌లో కార్మిక చట్టాలపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు.కార్మికులు ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలన్నారు. వాహనాలు నడిపే వారు విధిగా లైసెన్సులు పొందాలన్నారు. ప్రస్తుతం అతి తక్కువ ప్రీమియం ఉన్న బీమా పథకాలు అమలులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారి ఉన్నతికి బాటలు వేయాలన్నారు. నిరుపేదలకు ఉచితంగా న్యాయ సహాయం కూడా అందజేస్తామన్నారు. బాధ్యతాయుతంగా ఉంటూ సమాజాభివృద్ధికి కార్మికులు తోడ్పాటు అందించాలన్నారు. పలు సమస్యలను కార్మికులు ఏడీజే దృష్టికి తీసుకురాగా అధికారులతో చర్చించారు. ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాది సుదర్శన్, ఎస్ఐ కళావతి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, యూనియన్ ప్రతినిధులు, అబ్దుల్ హసీబ్,హఫీజ్, లోక్ అదాలత్ సిబ్బంది శారద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

అక్షింతల పంపిణీ

గుడిబండ: అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ధర్మ రక్షణా సమితి సభ్యులు, పళారం గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి వితరణ చేశారు. అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్ర పటం , ఆహ్వాన పత్రిక, హనుమాన్ జెండాను భక్తులకు వితరణ చేశారు. ఈ నెల 22న శ్రీరామమూర్తి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన చేస్తారన్నారు. అదే రోజు ప్రతి ఇంట్లో విశేష పూజలు చేసి జ్యోతులను వెలిగించి, అక్షింతలను స్వామి చిత్ర పటంపై వేసి 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అని స్మరించుకోవాలన్నారు.



పళారం గ్రామంలో అక్షింతల పంపిణీ దృశ్యం

అమరాపురం: స్థానిక శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉంచిన అయోధ్య శ్రీరాముని అక్షింతలను గోనపల్లికి చెందిన యువకులు శనివారం రాత్రి గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించి ఇంటింటికీ అందజేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త జె.శాంత



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త టిఎన్.దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

- హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త జె.శాంత

హిందూపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు చేరువచేశారని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త జె.శాంత అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 1వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జునగౌడ్ అధ్యక్షతన కొట్నూరు బీసీ కాలనీలో శనివారం ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు.అనంతరం వారు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మరోమారు జగనన్నను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

అవాస్తవాలు నమ్మవద్దు:

ఎన్నికలప్పుడు హైదరాబాద్ నుంచి వచ్చి సినిమా షోలు చూపించి గారడీ చేసే నేతలను నమ్మవద్దని టీఎన్ దీపిక, జె.శాంత ప్రజలకు సూచించారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూచి ఓర్వలేక ఎల్లో మీడియా అవాస్తవాలను చూపించి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, నిజం తెలుసుకుని వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహేంద్ర నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు షాజియా, రామచంద్ర పట్టణ బీ బ్లాక్ కన్వీనర్ బి.నరేష్, వార్డు ఇన్‌చార్జిలు దాదు, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నాగమణి, మల్లికాబాను, తరవీంద్రారెడ్డి, వివేకానందరెడ్డి, ఆసంద్ రెడ్డి, ముజీబ్, జబీ, కృష్ణారెడ్డి, బేల్దారి శీన, గంగాధర్, మూర్తి, చంద్ర, నరేష్, సుహేల్, జగన్, నరేష్, నబీరసూల్ పాల్గొన్నారు.

జోరుగా కులగణన సర్వే



ఆర్.అనంతపురంలో కులగణన సర్వే

మడకశిరరూరల్/పెనుకొండ రూరల్/గుడిబండ/అగళి: కులగణన సర్వే జోరుగా సాగుతోంది. మడకశిర మండల పరిధిలోని 18 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు శనివారం ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి వృత్తులు, కులం తదితర వివరాలు యాప్‌లో నమోదు చేశారు. పెనుకొండ మండలం గుట్టూరు, చంద్రగిరి, రాంపురం, శెట్టిపల్లి, అడదాకులపల్లి, నాగలూరు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన సర్వే నిర్వహించారని ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. గుడిబండ మండలంలో జరిగిన సర్వేను ఎంపీడీఓ రామారావు పర్యవేక్షించారు. అగళి మండలంలో 11 సచివాలయాల పరిధిలో సర్వే కొనసాగింది.

ప్రతిభ వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

హిందూపురం: ప్రతిభావంత క్రీడాకారులను ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశాలు కల్పిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం క్రీడాకారులకు హాకీ, క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడాంశంలో రాణించాలన్నారు. అవసరమైన శిక్షణ అందించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థితికి ఎదగలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ముస్తక్, అయూబ్, రోషన్ అలీ, నాయకులు హబీబ్, లైఫ్ వరల్డ్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, మున్సిపల్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మణూరు జట్టు ఘన విజయం

మడకశిర: 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మణూరు గ్రామ సచివాలయ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మణూరు సచివాలయం టీం 10 ఓవర్లలో 80 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మడకశిర సాయినగర్ సచివాలయ టీం 59 పరుగులు చేసి ఆలవుట్ అయింది. దీంతో మణూరు సచివాలయం జట్టు విజేతగా నిలిచింది అంపైర్లుగా ప్రకాష్, నాగభూషణం, నాగేంద్రలు వ్యవహరించారు. స్థానిక ఎంపీడీఓ సోనిబాయి, ఎంఈఓ నరసింహమూర్తి ఈ పోటీలను పర్యవేక్షించారు.



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్

సంక్షిప్త సమాచారం

నేడు మహోన్నతుల చిత్రపటాల ప్రదర్శన

పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని షాదీమహల్‌లో ముస్లిం మహోన్నతుల చిత్రపటాలను ఆదివారం ప్రదర్శించనున్నట్లు పెనుకొండ సమైక్య ముస్లిం మైనార్టీ కమిటీ నాయకులు శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్, టిప్పు సుల్తాన్, అష్ఫాఖుల్లాఖాన్, బేగం అనీస్ కిద్వాయ్ తదితర మహనీయుల చిత్రపటాలను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. ప్రజలు ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బరితెగించిన దొంగలు

మడకశిరరూరల్: దొంగలు బరితెగించారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో రైతు రవికుమార్‌కు చెందిన వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్, స్టార్టర్‌ను శుక్రవారం రాత్రి చోరీ చేశారు. అదే విధంగా గొల్లపల్లిలో కోళ్ల షెడ్ వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలించి సమీపంలో వదిలి వెళ్లారు. 20 రోజులుగా తరచూ వ్యవసాయ బోర్ల కేబుల్స్ చోరీకి గురవుతున్నట్లు రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రత్యేక నిఘా ఉంచి చోరీలు జరుగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

చిలమత్తూరు: చిలమత్తూరు పంచాయతీలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. చిలమత్తూరు-1 సచివాలయ పరిధిలో 4, చిలమత్తూరు-2 పరిధిలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. అర్హత ఉన్న వారు ఈనెల 26 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

దివ్యాంగుల్లో తెలివితేటలు అపారం



విద్యా సామగ్రి కిట్లు అందజేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: దివ్యాంగుల్లో తెలివితేటలు అపారమని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ అన్నారు.ఈ మేరకు శనివారం ఆయన కొడికొండ చెక్‌పోస్ట్‌లో సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో ఒరాకిల్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల్లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఎలాంటి విషయాన్ని అయినా ఒకసారి తెలియజేస్తే వెంటనే గ్రహించగలిగే శక్తి వారికి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు పంపిణీ చేశారు. సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, శిక్షకులు శంకర్, నరసింహమూర్తి,కవిత, ప్లేస్‌మెంట్ అధికారి ఎర్రిస్వామి, మొబెలైజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

మడకశిర: పట్టణంలోని వైకేపీ కార్యాలయంలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు నియంత్రణ, మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ నరేష్ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కిల్కారి మొబైల్ అకాడమి ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి పాల్గొని పై అంశాల పై క్షుణంగా వివరించారు. డాక్టర్ నరేష్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందని దీంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా శిక్షణ తీసుకుని గ్రామ స్థాయిలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ త్రిలోక్‌నాథ్ మాట్లాడుతూ పొగాకు వలన జరిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు వాయిదా

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించాల్సిన మండల స్థాయి బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను సోమవారానికి వాయిదా వేసినట్లు రత్నగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మోహన్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

మడకశిరరూరల్: వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం మండలంలోని హెచ్‌ఆర్‌పాళ్యం గ్రామంలో శ్రమదానం చేశారు. వీధులను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. శుభ్రత, సంక్షేమ పథకాలు, ఆర్బీకేలు, సచివాలయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పీఓ గోపికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య సేవలు

హిందూపురం: స్థానిక కంచికామాక్షి కళ్యాణ మండపంలో శనివారం జేవీఎస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బెంగళూరులోని సప్తగిరి ఆసుపత్రి వైద్యులు గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్ తదితరవ్యాధి గ్రస్తులు దాదాపు 250 మందికి వైద్యపరీక్షలు చేశారు. 40 మందికి ఆరోగ్యశ్రీ కింద బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, ఆల్‌ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్, వెంకటస్వామి, నర్సోజీరావు పాల్గొన్నారు.

వార్డు సచివాలయం తనిఖీ

మడకశిర: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న వార్డు సచివాలయాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు తనిఖీ చేశారు. కులగణనపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేకుండా వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏఈ మురళి, మేనేజర్ నజీర్, ఉద్యోగులు ఉన్నారు.